

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 28-04-2026 సంపుటి : 07 సంచిక 327 పేజీలు : 8 వెల : రూ 3-00


# విద్యుత్ కొనుగోలు ఛార్జీలను యూనిట్‌కు రూ.4.60కు తగ్గించేలా ప్రణాళికలు



రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం
ఇంధన రంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ
ఈవీ వాహనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన
పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథకాల అమలులో లక్ష్యాలను చేరుకునేలా కార్యాచరణ
విద్యుత్ శాఖ పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష

అమరావతి, ఏప్రిల్ 27: ప్రజా ప్రయోజనాల కోసమే సంస్కరణలు తెస్తున్నామని ఆ సంస్కరణల అమలు కోసం టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేసే అంశంపై నిరంతరం అధ్యయనం, జరుగుతూనే ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ పై సీఎం చంద్రబాబు సమీక్షించారు. వేసవిలో విద్యుత్ సరఫరా, 2026-27 ఏడాదిలో పవర్ ప్రొక్యూర్మెంట్ ప్లాన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు. వేసవిలో ప్రతి రోజూ 275 నుంచి 285 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు చెప్పారు. ఈ నెలలో ఇప్పటి వరకు 6397 మిలియన్ యూనిట్ల విద్యుత్ ను వినియోగించు కున్నామని వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం మేర విద్యుత్ వినియోగం పెరిగిందని తెలిపారు. విద్యుత్ వినియోగం పెరగడానికి వేసవితో పాటు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగిందని అధికారులు వివరించారు. వచ్చే ఆరు నెలల కాలానికి విద్యుత్ కొనుగోళ్ల ప్రణాళికలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ఏప్రిల్ 2025లో విద్యుత్ కొనుగోలు ధర రూ. 5.20 ఉండగా.. మార్చి 2026 నాటికి రూ. 4.90కు తగ్గించామని అధికారులు చెప్పారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పునరుత్పాదక విద్యుత్ పై దృష్టిఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."విద్యుత్ కొనుగోళ్ల వ్యయం తగ్గాలి. ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో.. అలాంటి చర్యలన్నింటి పైనా అధికారులు దృష్టి పెట్టాలి. విద్యుత్ రంగంలో ఏయే దేశాల్లో ఎలాంటి కొత్త ఆవిష్కరణలు అమలు అవుతున్నాయో అధ్యయనం చేయాలి. ఈ ఏడాది చివరి నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 4.60కు తగ్గించాలి. ఈ దిశగా విద్యుత్ శాఖాధికారులు దృష్టి సారించాలి. విద్యుత్ రంగంలో సహా ఏ రంగంలోనైనా ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే సంస్కరణలు అమలు చేస్తున్నాం. ప్రజలకు మేలు చేయాలంటే టెక్నాలజీ వినియోగం అత్యంత అవసరం. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ నిరంతరం గుర్తు చేసుకోవాలి. విద్యుత్ లో రీసెర్చ్ అండ్ అనాలసిస్ కు పెద్ద పీట వేయాలి. దీని కోసం ట్రాన్స్ కో, జెన్కో వంటి సంస్థలు తమకున్న సీఎస్సార్ నిధులు కేటాయించాలి. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులు జరిపేలా చర్యలు తీసుకుంటాం. పంప్డ్ స్టోరేజీ విధానంలో విద్యుత్ ఉత్పత్తిపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలి. ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాలి. 2028-29 నాటికి సగాని పైగా విద్యుత్ ఉత్పత్తి రెన్యూవబుల్ ఎనర్జీ ద్వారా వచ్చేలా చూడాలి. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 52396 సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్లు ఇచ్చాం. దీన్ని మరింత వేగంవంతం చేయాలి. ఇకపై ప్రతి నెల 2 లక్షల పీఎం సూర్య ఘర్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలి. పీఎం కుసుమ్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 2.94 లక్షల కనెక్షన్లు ఇచ్చాం. మొదటి విడత పీఎం కుసుమ్ పథకాన్ని డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలి. ఇక ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కొనుగోళ్లపై పెద్ద ఎత్తున ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, విద్యుత్, ట్రాన్సుకో, జెన్కో, వివిధ డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇప్పుడు వెళ్తున్నా.. మళ్లీ ఆరోజు తిరిగి వస్తా



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారానికి మరి కొద్ది గంటల్లోనే తెరపడనుంది. ర్యాలీలు, రోడ్‌షోలతో విస్తృత ప్రచారం సాగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం నాడు బరాక్‌పూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్రంలో బీజేపీ చక్కటి ఫలితాలు సాధిస్తుందనే నమ్మకం ఉందని చెప్పారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుందనే సంకేతాలు ఇస్తూ, బీజేపీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మళ్లీ వస్తానని ప్రధాని తెలిపారు.'ఈ ఎన్నికలకు సంబంధించి ఇదే నా చివరి ప్రచార ర్యాలీ. మే 4న ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి కచ్చితంగా వస్తాననే నమ్మకంతో తిరిగి వెళుతున్నారు. హెలిపాడ్ నుంచి నేను రెండు కిలోమీటర్ల ప్రయాణం చేసి ఇక్కడకు వచ్చాను. దారికి రెండు వైపులా వేలాది మంది ప్రజలు బారులు తీరారు. ఇంత పొద్దున్నే జనం పెద్ద సంఖ్యలో నన్ను ఆశీర్వదించడానికి వస్తారని ఊహించలేదు' అని మోదీ ఆనందం వ్యక్తం చేశారు.అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు గుప్పించారు. టీఎంసీ పాలనలో రాష్ట్రంలో పారిశ్రామిక కార్యకలాపాలు తగ్గిపోయాయని, ఫ్యాక్టరీలు మూతపడ్డాయని, పశ్చిమబెంగాల్ భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన రోడ్‌మ్యాప్ టీఎంసీ ప్రభుత్వం వద్ద లేదని అన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం అవసరం ఇక్కడ ఎంతైనా ఉందని, కేంద్ర-రాష్ట్రాల సమన్వయంతోనే వేగవంతమైన వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. టీఎంసీ సిండికేట్ వ్యవస్థ భూస్థాపితం కావాలన్నారు, నిర్మాణాత్మక పాలనకు బదులు బెదిరింపులు, మోసపూరిత రాజకీయాలపైనే టీఎంసీ ఆధారపడిందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు ఏమాత్రం భద్రత లేదని, ప్రజావిశ్వాసాన్ని టీఎంసీ కోల్పోయిందని, అది గుర్తుంచుకుని మహిళా ఓటర్లు ఓటు వేయాలని కోరారు.లండన్ తరహాలో కోల్‌కతాను అభివృద్ధి చేస్తామని టీఎంసీ గతంలో ఇచ్చిన హామీలను మోదీ ప్రస్తావిస్తూ, గత 15 ఏళ్లుగా కోల్‌కతా తన గుర్తింపును కోల్పోయిందని, అక్రమ చొరబాటుదారులు సిటీలో సెటిల్ అయ్యారని అన్నారు. నగర పూర్వ వైభవాన్ని పరిరక్షించేందుకు కోల్‌కతా వాసులంతా సమష్టిగా కృషి చేయాలని కోరారు. మెరుగైన శాంతి భద్రతల కోసం ఓటర్లు 'కమలం' గుర్తును ఎంచుకోవాలని కోరారు. సకాలంలో ప్రభుత్వ నియామకాలు జరుపుతామని, ఖాళీ ఉన్న పోస్టులు భర్తీ చేస్తామని, ఉద్యోగులకు 7వ వేతన కమిషన్ ప్రయోజనాలు చూకూరుస్తామని, జీరామ్‌జీ గ్రామీణ ఉపాధి పథకం అమలు చేస్తామని చెప్పారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలివిడత పోలింగ్ ఈనెల 23న జరుగగా, 29న తుది విడత పోలింగ్ జరుగనుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి.

# ఏయూ అంటే పేరు కాదు.. వందేళ్ల చరిత్ర: మంత్రి లోకేశ్..

విశాఖపట్నం: ఆంధ్ర యూనివర్సిటీ అంటే పేరు కాదని వందేళ్ల చరిత్రని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే తెలుగువారు పోరాడి తెచ్చుకున్న విశ్వవిద్యాలయం ఏయూ అని లోకేశ్ పేర్కొన్నారు. ఏయూ అంటే ఒక ఎమోషన్ అని.. తానిక్కడ చదువుకుని ఉంటే



బాగుండేదని అనిపిస్తోందన్నారు. విశాఖలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులను ఉద్దేశించి మంత్రి లోకేశ్ ప్రసంగించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్ర తొలి కేబినెట్ మీటింగ్ ఏయూలోనే ఏర్పాటు చేసినట్లు మంత్రి లోకేశ్ గుర్తు చేసుకున్నారు. ఏయూ చరిత్ర వెనుక ఎంతో మంది త్యాగం, కష్టం ఉందని అన్నారు. ఈ యూనివర్సిటీలో చిహ్నం నుంచి కోర్సులు వరకు అన్ని ప్రత్యేకమే అని చెప్పుకొచ్చారు. ఏయూ అనేక ర్యాంకులు సాధించి.. దేశంలో టాప్-3 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఉందన్నారు. అలాగే ప్రపంచంలో టాప్-100 యూనివర్సిటీల్లో నిలిచిందన్నారు. రాజకీయాల్లోనూ ఏయూ విద్యార్థులు రాణిస్తున్నారని మంత్రి చెప్పుకొచ్చారు. ప్రజలకు సేవ చేయాలని 2013 సంవత్సరంలో తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినట్లు గుర్తు చేసుకున్నారు.రిస్క్ లేనిదే విజయం లేదని.. విజయానికి ఓటమి తొలి మెట్టు అని విద్యార్థులకు మంత్రి లోకేశ్ సూచించారు. కాలం మారుతుందని, సాంకేతికత మారుతుందని కరిక్యులం కూడా మారాలన్నారు. ఈ సందర్భంగా విద్య శాఖలో ఖాళీలను రానున్న ఏడాది కాలంలోనే భర్తీ చేస్తామంటూ మంత్రి లోకేశ్ తీపి కబురు చెప్పారు. మంగళవారం నాడు విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసుకుంటున్నామని పేర్కొన్నారు. గూగుల్ రాకతో విశాఖ రూపురేఖలు మారిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.మరోవైపు ఏయూ వందేళ్ల వేడుకల సందర్భంగా స్మారక నాణెం, స్టాంప్, కాఫీ టేబుల్ బుక్‌ను ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, సచిన్ టెండూల్కర్, కేంద్ర, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా విడుదల చేశారు.

# పరిస్థితులకు తగిన నైపుణ్యాలను విద్యార్థులు పెంచుకోవాలి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



ఆంధ్రా విశ్వవిద్యాలయం శతాబ్ది మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ తదితరలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు పరిశోధన కేంద్రాలుగా మారాలని అన్నారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశోధనలు చేయాలని సూచించారు. యువతే దేశ భవిత అని ఆయన అన్నారు. ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన జీవన శైలిని యువత అలవాటు చేసుకోవాలని సూచించారు. కన్న తల్లి, జన్మ భూమి, పాఠాలు చెప్పిన గురువులను, మాతృ భాషను మర్చిపోకూడదని సూచించారు. తెలుగు భాష ప్రజలకు వెలుగు అని వ్యాఖ్యానించారు. ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టపడేది ఉండదని అన్నారు.రాష్ట్రంలో ఏయూను స్థాపించేందుకు అనేక మంది కృషి చేశారని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా తెలిపారు. తొలి వీసీ కట్టమంచి ఈ యూనివర్సిటీకి బలమైన పునాదులు వేశారని అన్నారు. రెండో వీసీ సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తు చేశారు. ఏయూలో 58 దేశాల విద్యార్థులు చదువుతున్నారని అన్నారు.




# సంపాదకీయం

మంగళవారం 28-04-2026

## మండే సూరీడు...

సూర్య భగవానుడు మండిపోతున్నాడు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మూడు రోజుల క్రితం వరకు చల్లబడ్డ వాతావరణం.. ఒక్కసారిగా వేడెక్కింది. సోమవారం రాష్ట్రంలోనే నిర్మల్ మండలంలోని అక్కాపూర్ గ్రామంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి కాలం ముందే వచ్చేసింది. మార్చి నెల ఆరంభం నుంచే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. మరో 2 నెలలు కష్టమేనని చెప్పింది. ప్రస్తుతం 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఇక మే నెలలో నలభై ఐదు డిగ్రీలు దాటే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.అనేక ప్రాంతాల్లో సాధరణం కంటే నాలుగైదు డిగ్రీలు అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక వాడగాల్పులు కూడా ప్రారంభమయ్యాయి. ఉదయం వేళ కొంత చల్లగాలులు వీస్తున్నా ఉదయం పది గంటల నుంచి మాత్రం వేడిగాలుల తీవ్రత ప్రారంభం అవుతుండటంతో వడదెబ్బ తగిలే అవకాశముందని వాతారణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే మూల్యంచెల్లించుకోవాల్సి ఉంటుందని, ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా అనేక వ్యాధులు సంక్రమించే అవకాశముందని, డీహైడ్రేషన్ కు లోను కాకుండా ప్రజలు తరచూ నీటిని తాగుతూ ఉండాలని సూచిస్తున్నారు.తెలంగాణలోనూ హైదరాబాద్ నగరం ఉదయం పది గంటలకే వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు ఇంటి నుంచి బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. ప్రజలు ఇప్పటికే అనేక వ్యాధులు బారిన పడి ఆసుపత్రులలో చేరుతున్నారని వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన జ్వరంతో పాటు జలుబు, దగ్గు, ఒళ్లునొప్పుల వంటి వాటితో వస్తున్నారని, కొందరు జ్వరంతో స్పృహకోల్పోతున్నారని కూడా చెబుతున్నారు. ఎండల తీవ్రతకు వ్యాపారాలు దెబ్బతినడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఆహార విషయాల్లో కూడా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.ఢిల్లీ సహా ఉత్తర భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈ వీకెండ్‌లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఢిల్లీలోని కొన్ని ఏరియాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటాయి. ఎండల తీవ్రత పెరగడంతో అధికారులు ఈ హెచ్చరికలు జారీ చేశారు.రాబోయే రెండు, మూడు రోజుల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ సహా మధ్య, పశ్చిమ భారత్‌లోని కొన్ని రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.వేసవికాలంలోని తీవ్రమైన ఎండలు ప్రాణాంతకంగా మారొచ్చు. తీవ్రమైన వేడి వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవడమే కాకుండా ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం కావచ్చు.ఉత్తర, మధ్య భారతంలో ఉష్ణోగ్రతలు వారాంతంలో మరో 2-3 డిగ్రీల సెంటిగ్రేడ్ పెరిగే అవకాశం ఉందని శుక్రవారం వాతావరణ శాఖ తెలిపింది.ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి పాఠశాలలకు ఢిల్లీ విద్యా శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.బహిరంగ ప్రదేశాల్లో క్లాస్‌లు నిర్వహించకూడదని, ఎండలో జరిగే స్కూల్ అసెంబ్లీలను తగ్గించాలని లేదా ఇండోర్‌లో నిర్వహించాలని సూచించింది.పిల్లలు నీళ్లు తాగాలని గుర్తు చేసేందుకు ప్రతి 45-60 నిమిషాలకు ఒకసారి బెల్ మోగించాలని కూడా సూచించింది.2024లో భారత్ ఎదుర్కొన్న మూడింట ఒకవంతు వడగాల్పులకు వాతావరణ మార్పులే కారణమని ఆ ఏడాది మెడికల్ జర్నల్ లాన్సెట్ ప్రచురించిన ఒక రిపోర్టులో పేర్కొన్నారు.2024లో తీవ్రమైన ఎండల కారణంగా దాదాపు 247 బిలియన్ గంటల(24,700 కోట్ల గంటలు) పని సమయాన్ని కోల్పోయినట్లు, దానివల్ల 19,400 కోట్ల డాలర్ల ఆదాయం నష్టపోయినట్లు ఈ రిపోర్ట్ అంచనా వేసింది.ప్రధానంగా వ్యవసాయం, నిర్మాణరంగం వంటి సెక్టార్లు ప్రభావితమైనట్లు పేర్కొంది.ఎక్కువ సమయం పాటు తీవ్రమైన వేడికి గురవ్వడం వల్ల ఆరోగ్యంపై పలు దుష్ప్రభావాలు ఉంటాయని నిపుణులు అంటున్నారు.ఉష్ణోగ్రతలు పెరిగితే డీహైడ్రేషన్, వడదెబ్బ, గుండె సంబంధిత ఒత్తిడి, మరణం సంభవించే ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.ముఖ్యంగా పసిపిల్లలు, వృద్ధులు, ఆరుబయట పనిచేసే కార్మికుల్లో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.వేడి ఎక్కువగా ఉన్నప్పుడు నీరు ఎక్కువగా తాగాలి. కనీసం రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. కాకరకాయ, దోసకాయ, సొరకాయ వంటి వాటర్ రిచ్ కూరగాయలు డైట్లో చేర్చుకోవాలి. ఇవి శరీరాన్ని కూల్‌గా ఉంచుతాయి. నీటి శాతం ఎక్కువగా ఉండే వాటర్‌మెలన్, మస్క్‌మెలన్ కూడా తీసుకోవచ్చు. ఇవి మీకు ఫ్రెష్ ఫీల్ ఇస్తాయి. బొప్పాయిని కూడా వేసవిలో తీసుకుంటే మంచిది. ఇది జీర్ణ సమస్యలను దూరం చేసి.. శరీరాన్ని లైట్‌గా ఉండేలా చేస్తుంది.మజ్జిగ శరీరానికి చల్లదనం ఇచ్చి డీహైడ్రేషన్‌ను తగ్గిస్తుంది. నిమ్మరసం విటమిన్ అతో పాటు ఎలక్ట్రోలైట్స్ అందిస్తుంది. కొబ్బరి నీరు నేచురల్ ఎలక్ట్రోలైట్ డ్రింక్? అవుతుంది. వెంటనే ఎనర్జీ అందిస్తుంది. వేసవిలో ఎక్కువ మసాలాలు ఉండేవి కాకుండా లైట్ ఫుడ్స్ తీసుకుంటే మంచిది. అవి సులభంగా జీర్ణమవుతాయి.ఎండలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. కానీ బయటకు వెళ్లాల్సి వస్తే.. నీరు తీసుకెళ్లండి. ఎక్కువ సేపు ఎండలో ఉండొద్దు. లైట్, కాటన్ దుస్తులు వేసుకోండి. మధ్యాహ్నం 12 నుంచి 3 మధ్య బయటకు వెళ్లడం తగ్గించండి. అలాగే ఫుడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోండి. ఇవి డీహైడ్రేషన్, అలసట వంటివి తగ్గిస్తాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా హెల్ప్ చేస్తాయి

## 'పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం'

### కోదాడ మున్సిపల్ ఛైర్మన్ ఎర్నేని కుసుమ

కోదాడ, ఏప్రిల్ 27 : పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో స్వర్ణభారతి చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని 34వ వార్డులో స్థానిక కౌన్సిలర్ గంధం బాలేంద్రపాండు సహకారంతో కుర్రి సీతారాములు జ్ఞాపకార్థం ఆయన 10వ వర్ధంతి సందర్భంగా యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.



శిబిరంలో దాదాపు 400 మందికి అన్ని రకాల వ్యాధులతో పాటు షుగర్, బీపీ, ఈసీజీ, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. లయన్స్ కంటి ఆసుపత్రి వారిచే కంటి పరీక్షలు చేసి మందులు అందించడంతో పాటు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.సామాజిక సేవలో స్వర్ణ భారతి ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ గంధం బాలేంద్ర, పాండు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ల తో పాటు వైద్యులను శాలువా, పూలబొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరి, కౌన్సిలర్లు నాగేశ్వరరావు, వంగూరి గోపి, తోట శ్రీను, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల ప్రవీణ, రాజశేఖర్, ఓరుగంటి కిట్టు, గుండెపంగు రమేష్, కాంపాటి పుల్లయ్య, ఏర్పుల తిరుప్, శ్రావణ్, కుర్రి నాగరాజు, కుర్రి శ్రీను, కుర్రి వెంకమ్మ, కుడుముల శ్రీను, వంశీ, హేమావతి, చిట్టిప్రోలు నారాయణ పాల్గొన్నారు.

## 'యూరియా ఆన్‌లైన్ విధానం ఎత్తేయాలి'

### కలెక్టర్, డీఏఓకు పెస్టిసైడ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 27 : యూరియా ఆన్‌లైన్ విధానం ఎత్తివేయాలని, ఎరువుల బస్తాలకు ఇతర ప్రోడక్ట్ లింక్ చేయొద్దని ఫర్టిలైజర్ పెస్టిసైడ్ సీడ్స్ డీలర్స్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఫర్టిలైజర్ షాపుల బంద్ సోమవారం విజయవంతం అయింది. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానం నుండి పెస్టిసైడ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి గడియారం సెంటర్ మీదుగా ర్యాలీగా వెళ్లి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టర్ చంద్రశేఖర్ కు వినతిని అందజేసి మాట్లాడారు. రైతులు, డీలర్ల ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ చర్యలు కంపెనీలకు కొమ్ముకాసేలా ఉంటున్నాయన్నారు.



ఎరువుల స్టాక్ పాయింట్ నుండి దుకాణానికి సరఫరా అయ్యే రవాణా ఖర్చులు భరించాలని, బడా కంపెనీల పెత్తనం తగ్గించాలని కోరారు.లింకు ప్రోడక్ట్ బలవంతంగా అంటగట్టడాన్ని నిలిపివేయాలన్నారు. రాష్ట్రవ్యాప్త ఎరువుల దుకాణాల బంద్ కార్యక్రమంలో భాగంగా పెస్టిసైడ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమానికి తిప్పర్తి, కనగల్, మునుగోడు, గుర్రంపోడు, మాడుగులపల్లి మండలాల నుంచి పెద్ద ఎత్తున డీలర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఫర్టిలైజర్ ఫెర్టిసైడ్స్ సీడ్స్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బండ శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి మధు, కోశాధికారి సుంకరి నాగరాజుగౌడ్, పగిడి విగ్నేష్, యాదగిరి రెడ్డి, ఉపేందర్, మహేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గోవింద్ రెడ్డి, శ్రీను, వెంకన్న, చంద్రమౌళి, నాగభూషణ్ పాల్గొన్నారు.

## 'బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ'


చండూరు, ఏప్రిల్ 27 : నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల వేడుకలను సోమవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చండూరు మాజీ ఎంపీపీ తోకల వెంకన్న మాట్లాడుతూ.. 2001 ఏప్రిల్ 27న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హైదరాబాద్ లోని "జలదృశ్యం" వద్ద పార్టీ స్థాపించిన రోజు నుండి ఇవాల్టికి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ పార్టీగా ప్రారంభించి, ఇది కేవలం వ్యక్తి పార్టీ కాకుండా, తెలంగాణ అంచనాలు



నిధులు?నీళ్లు?నియామకాలు అనే చైతన్యం కలిగిన ప్రజా పార్టీగా రూపాంతరం చెందిందని తెలిపారు. కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని పునరుజ్జీవింపజేసి, దశాబ్దాల కలను 2014లో నిజం చేశారని, తెలంగాణకు ఈ రోజు బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంలో మొదటగా తెలంగాణ ప్రజలకు, ఉద్యమకారులకు, పార్టీ కార్యకర్తలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఎరాబోయే రెండు సంవత్సరాల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసే వరకు అలుపెరగకుండా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కురుపాటి సుదర్శన్, మాదగోని వెంకటేశం, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పెద్దగోని వెంకన్న గౌడ్, కౌన్సిలర్లు కొండ్రెడ్డి మధు, బీఆర్టీయూ పట్టణ అధ్యక్షుడు చొప్పరి దశరథ, సర్పంచులు కొండ రజిత రవి, ఉజ్జిని ఉష అనిల్ రావు, నారపాక వసంత ధనయ్య, ఆలేటి యాదయ్య, దామెర రాములు, సుంకరి సత్తయ్య, చిలువేరు నరేష్, బేరి చంద్రశేఖర్, నందికొండ నర్సిరెడ్డి, గాలంక కృష్ణయ్య, మహమ్మద్ గౌస్, పల్లె నాగార్జున, కరుణాకర్ రెడ్డి, వెంకటయ్య, గండూరి జనార్ధన్, ఇరిగి రామన్న, ఇరిగి రామకృష్ణ, గురునాథం, వెంకటాచారి, జాల వెంకన్న, దోటి శీను, రాపోలు జగదీష్, బోడమోహన్, తందార రవి, భూతరాజు వెంకన్న పాల్గొన్నారు.

## మునుగోడులో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

మునుగోడు, ఏప్రిల్ 27 : భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మునుగోడు మండల కేంద్రంలో సోమవారం ఆ పార్టీ మండలాధ్యక్షుడు మందుల సత్యం అధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఈ సందర్భంగా మందుల సత్యం పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో నన్నూరి భూపతి రెడ్డి, గజ్జెల బాలరాజు గౌడ్, పొలగొని సైదులు గౌడ్, మారగోని అంజయ్య గౌడ్, పగిళ్ల సతీష్, యడవల్లి సురేష్ కుమార్, ఎల్లంకి యాదగిరి, అద్దంకి జగన్, గురుపాదం, దోటీ కరుణాకర్, నందిపాటి వెంకన్న, జిట్టగోని సైదులు, పందుల అంజి, గుర్రాల సురేష్, కట్కూరి శ్రీను, గాలి సైదులు, బండారు శ్రీనివాస్, జిట్టగోని మల్లేష్ యాదవ్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## జూలూరుపాడులో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



జూలూరుపాడు, ఏప్రిల్ 27 : జూలూరుపాడు మండల కేంద్రంలో బీఆర్ఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్టీ శ్రేణుల మధ్య అత్యంత ఉత్సాహంగా, పండుగ వాతావరణంలో సోమవారం జరిగాయి. మండల కేంద్రంలోని పార్టీ సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన గులాబీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా యల్లంకి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా కేసీఆర్ పార్టీని స్థాపించి, సబ్బండ వర్గాలను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపిన తీరును కొనియాడారు. స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల రక్షణలో కేసీఆర్ ఎప్పటికీ 'శ్రీరామరక్ష' అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కార్యకర్తలంతా సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చాపలమడుగు రామ్మూర్తి, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు యదళపల్లి వీరభద్రం, మాజీ సొసైటీ డైరెక్టర్ భూక్యా జోహార్ లాల్, గుండెపూడి ఉప సర్పంచ్ బాదావత్ నరేష్ పాల్గొన్నారు. వీరితో పాటు పార్టీ మండల నాయకులు తాళ్లూరి రామారావు, గుమ్మడి వెంకటేశ్వర్లు, బుడిపూడి ప్రభాకర్, ఇల్లంగి తిరుపతి, పోతురాజు రామారావు, పురస్తపురవు రామకృష్ణ, బండారి వెంకయ్య, బుడిపూడి ప్రతాప్, పోతురాజు కృష్ణ, ఈసాల వెంకటేష్, ముకేష్, చందు తదితర ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యంపై రైతుల రాస్తారోకో



తొర్రూరు : మహబూబాబాద్ జిల్లాలో మొక్కజొన్న పండించిన రైతులకు కష్టాలు మొదలయ్యాయి. సరైన సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, కాంటా వేయడంలో జాప్యం వంటి కారణాలతో జిల్లాలోని మార్కెట్ యార్డులు మొక్కజొన్నతో నిండిపోయాయి.గన్ని బ్యాగులు, లారీల కొరత తీవ్రంగా ఉండటంతో కొనుగోలు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. దీంతో మార్కెట్ యార్డులన్నీ మక్క బస్తాలతో కిక్కిరిసిపోయి, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పరిస్థితి మరింత దారుణంగా మారింది. కాంటా వేసిన మొక్కజొన్నను పూర్తిస్థాయిలో తరలించకపోవడంతో రైతులు రోజులు తరబడి అక్కడే ఉండాల్సి వస్తోంది.సుమారు 5వేల బస్తాల మక్క నిల్వ ఉండగా, లారీల కొరత కారణంగా వాటిని తరలించ లేకపోతున్నామని అధికారులు స్వయంగా చెబుతున్నారు. సుమారు 25 వేల గన్ని బ్యాగులు అవసరం ఉండగా, కేవలం 5000 బ్యాగులు మాత్రమే సరఫరా చేసినట్లు సమాచారం. ఈ పరిస్థితులపై ఆగ్రహం చెందిన రైతులు సోమవారం మహబూబాబాద్ ప్రధాన రహదారిపై మొద్దులు అడ్డంగా పెట్టి రాస్తారోకో చేపట్టారు. దీంతో రాకపోకలు పూర్తిగా స్థంభించాయి.సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రైతులను శాంతింపజేయడానికి ప్రయత్నించినప్పటికీ, రైతులు వెనక్కి తగ్గకుండా అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

## గులాబీ జెండా నే తెలంగాణ రాష్ట్రం

### కేసీఆర్ లేకుండ బీఆర్ఎస్ లేదు

### బీఆర్ఎస్ లేకుండ తెలంగాణ రాష్ట్రం లేదు!

సిద్దిపేట ,సిద్దిపేట నియోజకవర్గం లో అన్ని గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు.భారత రాష్ట్ర సమితి 26వ ఆవిర్భావం సందర్బంగా సిద్దిపేట నియోజకవర్గం లిప్ అన్ని మండల కేంద్రాల్లో, అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఆవిష్కరణ చేసారు. పల్లె పల్లె నా ప్రతి వార్డ్ లో గులాబీ జెండా ఎగిరింది. ఈ సందర్బంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ త్యాగ ఫలితం అని కెసిఆర్ హరీష్ రావులు లేకుండా తెలంగాణ ఏర్పాటు సాధ్యమయ్యేది కాదని బి ఆర్ ఎస్ నేతలు అన్నారు. సిద్దిపేట గులాబీ జెండా కు పురుడు పోసుకొందని..ఆ జెండా నే నెటి రాష్ట్రమని చెప్పారు కెసిఆర్ లేంది గులాబీ జెండా బి అర్ ఎస్ పార్టీ లేదు..బి ఆర్ ఎస్ పార్టీ లేంది తెలంగాణ ఉద్యమం..పోరాటం రాష్ట్రం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు 60 ఏళ్ల పోరాట కల ను సాధ్యం చేయడానికి డిప్యూటీ స్పీకర్ గా రాజీనామా చేసి తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషిస్తూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కేసీఆర్ అనేక రూపాలలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కెసిఆర్ దక్కుతుందని అన్నారు. కెసిఆర్ పోరాటంలో హరీష్ రావు వెన్ను దన్నుగా నిలిచి రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ప్రాంతాన్నంత కలియ తిరుగుతూ పోరాటాన్ని ఉధృతం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో తన శక్తినంత ధారపోశారని అన్నారు. ఈ కార్యక్రమం లో అన్ని మండలాల సీనియర్ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచ్ లు గ్రామ శాఖ అధ్యక్షులు,మాజీ సర్పంచ్ ఎంపీటీసీ లు, పార్టీ అన్ని విభాగల అధ్యక్షులు పార్టీ శ్రేణులు పాల్గొని ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

# కొత్త లుక్ లో జగన్

విజయవాడ, ఏప్రిల్ 27, వైఎస్సార్‌సీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటనకు బయలుదేరారు. తన కుటుంబ సభ్యులతో కలిసి యూరప్‌లోని పలు దేశాలను సందర్శించేందుకు ఆయనకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం అనుమతిని ఇచ్చింది. వాస్తవానికి ఈనెల 20వ తేదీ నుంచే పర్యటన ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ.. కొన్ని అనివార్య కారణాల వల్ల ఐదు రోజులు ఆలస్యంగా.. బెంగళూరు విమానాశ్రయం నుంచి విదేశాలకు ప్రయాణమయ్యారు. కోర్టు ఇచ్చిన గ్రీన్ సిగ్నల్ ప్రకారం మే 15వ తేదీ వరకు ఆయన యూరప్‌లో గడపనున్నారు.ఈ పర్యటనలో జగన్మోహన్ రెడ్డి డ్రెస్సింగ్ స్టైల్ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా ఏపీలో రాజకీయ కార్యక్రమాల్లో ఉన్నప్పుడు వైట్ షర్ట్, ఖాకీ లేదా గోధుమ రంగు ప్యాంటు, సాధారణ చెప్పులతో అత్యంత నిరాడంబరంగా కనిపించే జగన్.. ఈసారి ట్రెండీ లుక్‌లో దర్శనమిచ్చారు. బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఆయన జీన్ షర్ట్, జీన్ ప్యాంట్, షూస్, ఖరీదైన వాచీ ధరించి కనిపించారు. ఎయిర్‌పోర్టులోని ప్రయాణికులు, అభిమానులు జగన్ సరికొత్త అవతారాన్ని చూసి ఆశ్చర్యపోయారు. ఆయనతో ఫోటోలు దిగేందుకు, వీడియోలు తీసేందుకు పోటీ పడ్డారు. ప్రస్తుతం ఈ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. జగన్ ఇలా కొత్త లుక్‌లో కనిపించటం ఇదే మొదటిసారి కాదని.. ఆయన విదేశాలకు వెళ్లిన ప్రతిసారీ తన లుక్‌లో మార్పులు చూపిస్తుంటారని అభిమానులు చర్చించుకుంటున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి కూడా విదేశీ పర్యటనలకు వెళ్లే సమయంలో సూట్, షూ ధరించి స్టైలిష్‌గా కనిపించేవారని.. జగన్ ఇప్పుడు తన తండ్రి బాటనే అనుసరిస్తున్నారని వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాయి. రాజకీయాల్లో ఎప్పుడూ సీరియస్‌గా కనిపించే తమ నాయకుడు.. ఇలా రిలాక్స్‌డ్ మూడ్‌లో



కనిపించడం పట్ల అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.మే 15 వరకు సాగే ఈ వ్యక్తిగత పర్యటనలో ఆయన కుటుంబ సభ్యులతో సమయం గడపనున్నారు. పర్యటన ముగిసిన వెంటనే ఆయన తిరిగి తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు. ఆ తర్వాత మళ్లీ పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నం కానున్నట్లు వైసీపీ శ్రేణులు వెల్లడిస్తున్నాయి.ఈసారి ఆయన పర్యటన కంటే, ఆయన వేసుకున్న బ్లూ డెనిమ్ డ్రెస్సుపై వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న హడావుడే ఇప్పుడు నెటిజన్లకు పెద్ద వినోదంగా మారింది. బెంగళూరు విమానాశ్రయంలో దిగిన ఆ ఫోటోలను పట్టుకుని, కూల్ లుక్ , స్టైలిష్ సీఎం అంటూ ఎలివేషన్లు ఇస్తున్నారు.వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు ఎంత కష్టపడి ఆ లుక్‌ని కొత్తగా ప్రాజెక్ట్ చేద్దామని చూస్తున్నా.. షార్ప్ ఐ ఉన్న నెటిజన్లు మాత్రం అసలు గుట్టు కనిపెట్టేశారు. జగన్ రెడ్డి వేసుకున్న ఆ డెనిమ్ షర్ట్, ప్యాంటు కొత్తవేమీ కావు. సరిగ్గా గత ఏడాది లండన్ టూర్ వెళ్లినప్పుడు కూడా ఆయన ఇవే బట్టల్లో దర్శనమిచ్చారు. పాత ఫోటోలను తీసి పక్కన పెడితే, డ్రెస్సింగ్ స్టైల్ లో ఇసుమంతైనా మార్పు లేదని తెలిపోయింది. బహుశా ఆయనకు ఆ బ్రాండ్ మీద ఉన్న మక్కువో లేక సింప్లిసిటీ అనిపించుకోవాలనే తాపత్రయమో కానీ, కొత్తగా ఏదో జరిగిపోయిందని బిల్డప్ ఇవ్వడం మాత్రం అతిగా అనిపిస్తోంది.గతంలో సంక్షేమ పథకాలు, బటన్ నొక్కుడు గురించి గప్పాలు కొట్టుకునేవారు. ఇప్పుడు చెప్పడానికి అవేమీ లేకపోవడంతో, చివరకు తమ నాయకుడి ఇటాలియన్ బ్రాండ్ షూలు, పాత డెనిమ్ డ్రెస్సుల మీద కూడా విశ్లేషణలు చేయాల్సి వస్తోంది. మా నాయకుడు బ్లూ డ్రెస్సులో అదిరిపోయాడు అని పోస్టులు పెట్టడం చూస్తుంటే, వైసీపీ దగ్గర అసలు రాజకీయ అజెండా ఖాళీ అయిపోయిందని, అందుకే ఇలాంటి డ్రెస్సింగ్ ఎలివేషన్ల మీద ఆధారపడుతున్నారని విశ్లేషకులు సెటైర్లు వేస్తున్నారు.

## కొనసాగుతున్న ఇంధన కొరత



విజయవాడ,ఎన్టీఆర్ జిల్లా లో ఇంధన కొరత తీవ్రంగా కనిపిస్తోంది. ముఖ్యంగా (హెచ్పీసీఎల్), (బిపిసిఎల్) డిపోల్లో డీజిల్ సరఫరా అంతరాయం ఏర్పడటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. విశాఖపట్నం నుంచి రావాల్సిన డీజిల్ తక్కువ మోతాదులో చేరుతున్నందున కొండపల్లి డిపోల్లో నిల్వలు తగ్గిపోయాయి. దీంతో అక్కడి నుంచి ప్రకాశం, ఏలూరు, ఉమ్మడి కృష్ణా జిల్లాలకు సరఫరా కావాల్సిన డీజిల్ అరకొరగానే పంపిణీ అవుతోంది. డీజిల్ లోడింగ్ కోసం హెచ్పీసీఎల్, బిపిసిఎల్ డిపో ముందుకు వందలాది ట్యాంకర్ లారీలు చేరుకుని గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సరఫరా ఆలస్యం కారణంగా ట్రాన్స్పోర్ట్ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇక పెట్రోల్ బంకుల యాజమాన్యాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రోజూ ఇండెంట్ పెట్టినా, రెండు మూడు రోజులకోసారి మాత్రమే డీజిల్ అందుతోందని చెబుతున్నారు. దీంతో బంకుల వద్ద డీజిల్ కోసం వాహనదారులు భారీగా క్యూ కడుతున్నారు. ప్రత్యేకంగా విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారి పై పరిస్థితి మరింత తీవ్రమైంది. డీజిల్ కోసం లారీలు, కార్లు బంకుల ముందు బారులు తీరడం వల్ల ట్రాఫిక్కు అంతరాయం కలుగుతోంది. ఇంధన కొరత త్వరగా పరిష్కరించకపోతే రవాణా, వ్యవసాయ రంగాలపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకుని సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## వాకింగ్ ట్యాక్స్ ఆరోపణలు నిజం కాదు..

విశాఖపట్టణం, ఏప్రిల్ 27, విశాఖపట్నంలో పార్కులలో నడకపై వాకింగ్ ట్యాక్స్ విధిస్తున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం దీనిపై క్లారిటీ ఇచ్చింది. విశాఖలో వాకింగ్ ట్యాక్స్ అనేది పూర్తిగా అవాస్తవమన్న ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం.. శివాజీ పార్కు, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నామమాత్రపు రుసుం వసూలు చేస్తున్నట్లు తెలిపింది. దీనిపై ప్రజల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని.. కొంతమంది కావాలని పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని క్లారిటీ ఇచ్చింది.ప్రస్తుత సోషల్ మీడియాలో యుగంలో నిత్యం ఎన్నో రకాల వార్తలు, వీడియోలు వైరల్ అవుతుంటాయి. అందులో కొన్ని వాస్తవాలు ఉంటే.. మరికొన్ని అబద్ధాలు, అసత్యాలు ఉంటుంటాయి. ఈ క్రమంలోనే విశాఖపట్నానికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో ఇటీవల వైరల్ అయ్యింది. విశాఖపట్నంలో నడిస్తే కూడా పన్ను కట్టాలని.. మున్సిపల్ స్టేడియాలు, పార్కులలో నడవాలంటే రూ.720 చెల్లించాలంటూ నెట్టింట కొన్ని వార్తలు వైరల్ అయ్యాయి. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం సహా పార్కులలో యూజర్ ఛార్జీలు చెల్లించాలంటూ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై ఏపీ ప్రభుత్వం ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం క్లారిటీ ఇచ్చింది.విశాఖపట్నం పార్కుల్లో నడకపై వాకింగ్ ట్యాక్స్ విధిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని జీవీఎంసీ స్పష్టం చేసినట్లు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం వెల్లడించింది. ఈ అంశంపై కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపింది. ప్రజల ఆరోగ్యం కోసం జీవీఎంసీ గత రెండు సంవత్సరాల కాలంలో సుమారు రూ.35 కోట్లతో 45 పార్కులను అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసినట్లు వెల్లడించింది. మరో రూ.30 కోట్లు ఖర్చు చేసి క్రీడా స్టేడియాలు, ఆట స్థలాలను ఆధునీకరించినట్లు తెలిపింది. విశాఖపట్నంలోని ఏ ఓపెన్ పార్కులోనూ ప్రస్తుతం వాకర్స్ నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయడం లేదని క్లారిటీ ఇచ్చిందిఅయితే శివాజీ పార్కులో మాత్రం గత పాతికేళ్లుగా రూ.5 నామమాత్రపు రుసుం వసూలు చేస్తున్నారని.. మిగతా 180 పార్కులలో ఎలాంటి వాకింగ్ ఫీజు లేదని ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. రూ.18 కోట్ల వ్యయంతో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని.. దీనిని జీవీఎంసీ స్వయంగా నిర్వహిస్తోందని పేర్కొంది. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో వాకర్స్ కోసం తాగునీటి సౌకర్యం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారని.. దీని నిర్వహణ ఖర్చుల కోసం రోజుకు రూ.2 చొప్పున.. నెలకు రూ 60 , ఏడాదికి రూ.720 నామమాత్రపు రుసుం వసూలు చేస్తున్నట్లు వెల్లడించింది.శివాజీ పార్కు, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాల్లో ఈ స్వల్ప రుసుం చెల్లిస్తూ పెద్ద సంఖ్యలో ఈ సౌకర్యాలను ఉపయోగించుకుంటున్నారని.. కానీ ఎవరి నుంచి కూడా అభ్యంతరాలు రాలేదని స్పష్టం చేసింది. కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని.. వాకింగ్ ట్యాక్స్ అనే ప్రచారాన్ని నమ్మవద్దని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం స్పష్టం చేసింది.

## స్మార్ట్ సిటీగా గుంటూరు...

గుంటూరు, ఏప్రిల్ 27,గుంటూరు నగర రూపురేఖలను సమూలంగా మార్చేందుకు నగరపాలక సంస్థ భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. రాజధాని ప్రాంతంలో కీలకమైన నగరంగా ఉన్న గుంటూరును మరింత సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఆరు ప్రధాన మార్గాలను 'మోడల్ కారిడార్లు'గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. సుమారు రూ. 210 కోట్ల అంచనా వ్యయంతో 39.3 కిలోమీటర్ల మేర ఈ రహదారులను ఆధునిక హంగులతో తీర్చిదిద్దనున్నారు.చుట్టుగుంట సెంటర్ ? గోరంట్ల రోడ్డు: 8 కి.మీ పొడవునా అమరావతి రోడ్డు వరకు విస్తరణ.మద్రాసు గుంటూరు రోడ్డు: దండిమార్చి విగ్రహం నుండి అంకిరెడ్డిపాలెం వరకు 8 కి.మీ మేర అభివృద్ధి.ఇన్నర్ రింగ్ రోడ్డు: మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు నుండి జాతీయ రహదారి అనుసంధానం వరకు 12 కి.మీ.పొన్నూరు రోడ్డు: బీఆర్ స్టేడియం నుండి బైపాస్ వరకు 4.5 కి.మీ.గుంటూరు ? హనుమాన్ పాలెం రోడ్డు: చాకలి చెరువు నుండి బైపాస్ వరకు 3.8 కి.మీ.గుంటూరు వీఐపీ రోడ్డు: వెస్ట్ పోలీస్ స్టేషన్ నుండి బైపాస్ వరకు 3 కి.మీ మేర ఆధునికీకరణ.ప్రత్యేకంగా వెండింగ్ జోన్లు..ఈ ప్రాజెక్టులో భాగంగా కేవలం రోడ్ల విస్తరణే కాకుండా.. పాదచారుల కోసం ప్రత్యేక నడక మార్గాలు, సైకిల్ ట్రాకులు, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయనున్నారు

## పీఏగా ట్రాన్స్ జెండర్

గుంటూరు, ఏప్రిల్ 27,గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి వినూత్న నిర్ణయం తీసుకున్నారు. సమాజంలో వివక్షకు, అవమానాలకు గురౌతున్న ట్రాన్స్‌జెండర్‌కు అండగా నిలబడ్డారు గల్లా మాధవి. తన కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్‌కు ఉద్యోగం కల్పించి.. తన నిబద్ధతను మాటల్లో కాకుండా, చేతల్లో చేసి చూపించారు. ట్రాన్స్‌జెండర్లకు గౌరవప్రదమైన జీవనోపాధి కల్పించే దిశగా.. తన వ్యక్తిగత సహాయకురాలిగా ట్రాన్స్‌జెండర్‌ను నియమించుకుని సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు.ట్రాఫిక్ సిగ్నల్ల వద్ద, రైళ్లల్లో ట్రాన్స్‌జెండర్లను గమనించినప్పుడు ఎందుకు వీరిలా ఉంటున్నారని తనకు అనిపించేదని గల్లా మాధవి చెప్తున్నారు. ఇదే విషయాన్ని వాళ్లను అడిగినప్పుడు సమాజంలో అందరూ తమను వెలివేసినట్లుగా చూస్తున్నారని.. తమను ఎవరూ ఆదరించటం లేదని తనతో చెప్పినట్లు తెలిపారు.ట్రాన్స్ జెండర్ల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. చదువు లేకపోవటంతో వారు వెనకబడుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే వీరిలోనూ కొంతమంది చదువుకున్న వారు ఉన్నారన్న గల్లా మాధవి.. ఇటీవల తిరుపతి పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడ ఉన్న ట్రాన్స్‌జెండర్లు తమకు వారి సమస్యలు చెప్పుకున్నారని అన్నారు. దీంతో వారికి ఏదైనా పరిష్కారం చూపించాలని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. కుక్కల హక్కులు, వాటిని కాపాడాలని పోరాడే ప్రస్తుత రోజుల్లో ..ట్రాన్స్‌జెండర్ల కోసం మాత్రం ఆలోచించేవారు తక్కువయ్యారని గల్లా మాధవి అభిప్రాయపడ్డారు. ఏప్రిల్ ఆరో తేదీన ట్రాన్స్‌జెండర్ అయిన ఓ అమ్మాయి తన వద్దకు వచ్చి, తాను బీకాం చదువుకున్నానని, ఉపాధి కల్పించాలని కోరిందని.. దీంతో తన కార్యాలయంలో ఉద్యోగం కల్పించినట్లు గల్లామాధవి వివరించారు. ఇంకో నలుగురు వచ్చినా కూడా ఉద్యోగం కల్పించే ప్రయత్నం చేస్తానని అన్నారు.మరోవైపు ట్రాన్స్‌జెండర్లకు కూడా మిగతా వారితో పాటుగా సమాజంలో గౌరవం, హోదా, సమానత్వం కావాలని గల్లా మాధవి ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగాల సమయంలో ట్రాన్స్‌జెండర్లు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లకు పింఛన్లు, ఇళ్లు అందిస్తూ వారికి అండగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే గల్లా మాధవి వెల్లడించారు.గల్లా మాధవి నిర్ణయం ఇతర ప్రజాప్రతినిధులకు ఒక 'గోల్డెన్ స్టాండర్డ్' అని మంత్రి లోకేష్ అభివర్ణించారు. మానవత్వాన్ని చాటిచెబుతూ అణగారిన వర్గాలకు అండగా నిలిచిన ఆమెకు ప్రత్యేకంగా సెల్యూట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో సామాజిక న్యాయాన్ని చూపిస్తూ గల్లా మాధవి అందరికీ స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. ట్రాన్స్‌జెండర్ల పట్ల సమాజంలో ఉన్న దృక్పథాన్ని మార్చడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గల్లా మాధవి ఈ సందర్భంగా వెల్లడించారు. ట్రాఫిక్ సిగ్నల్ల వద్ద, రైళ్లలో వారు పడుతున్న కష్టాలు చూసి చలించిపోయానని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. భవిష్యత్తులో కూడా ట్రాన్స్‌జెండర్ల సాధికారత కోసం ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

## గూగుల్ డెటా సెంటర్ పూజకు అంతారెడీ

విశాఖపట్టణం, ఏప్రిల్ 27, ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న ప్రతిష్టాత్మకమైన గూగుల్ ఏఐ డేటా సెంటర్ హబ్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఈ భారీ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం ఈనెల 28న అత్యంత వైభవంగా జరగనుంది. సుమారు 1.25 లక్షల కోట్ల రూపాయల అసాధారణ పెట్టుబడితో గూగుల్ తన అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ద్వారా ఈ కేంద్రాన్ని నెలకొల్పుతోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ హాజరుకానున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ , ఇతర పరిపాలనాపరమైన అనుమతులు దాదాపు పూర్తికావడంతో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. విశాఖపట్నం జిల్లాలోని అడవివరం, తర్లువాడ , అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి ప్రాంతాల్లో కలిపి మొత్తం 601.4 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. ఈ మూడు ప్రాంతాల్లోని స్థలాలను చదును చేసే పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. పర్యావరణ నిబంధనలకు లోబడి, స్థిరమైన ఇంధన వనరుల వినియోగంతో ఈ గ్రీన్ డేటా సెంటర్‌ను నిర్మించనున్నారు.భారతదేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగా భావిస్తున్న ఈ ప్రాజెక్టులో అదానీ ఇన్‌ఫ్రా భాగస్వామ్య సంస్థగా వ్యవహరిస్తోంది. ఈ డేటా సెంటర్ కేవలం సమాచార నిల్వకే పరిమితం కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధనలు, క్లౌడ్ కంప్యూటింగ్ , గ్లోబల్ టెక్ సర్వీసులకు ప్రధాన కేంద్రంగా మారుతుంది. 1 గిగావాట్ సామర్థ్యంతో నిర్మించనున్న ఈ హబ్ ద్వారా ప్రత్యక్షంగా , పరోక్షంగా వేలాది మంది యువతకు సాఫ్ట్‌వేర్, డేటా అనలిటిక్స్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.విశాఖపట్నం కేంద్రంగా రాబోతున్న ఈ ఏఐ హబ్ ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చేస్తుందని ఐటీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రాజెక్టును జూలై 2028 నాటికి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నది గూగుల్ లక్ష్యం. దీని వల్ల ఏపీకి మరిన్ని అంతర్జాతీయ టెక్ కంపెనీలు తరలివచ్చే అవకాశం ఏర్పడటమే కాకుండా, రాష్ట్రాన్ని ఏఐ రాజధానిగా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పం వేగంగా కార్యరూపం దాల్చుతోంది.

# గోదావరి జిల్లాల్లో డీజిల్ కొరత...

కాకినాడ, ఏప్రిల్ 27, హర్మూజ్ జలసంధిలో ఇరాన్, అమెరికా దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఏపీలోనూ డీజిల్ సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. రోజురోజుకు ఆ దేశాల మధ్య పెరుగుతోన్న ఉద్రిక్తత ఏక్షణాన ఆయిల్ సంక్షోభం తలెత్తుతుందోనన్న భయం అన్ని రంగాల్లోనూ కనిపిస్తోంది. ఆయిల్ డీలర్లు ముందస్తుగా చెల్లింపులు చేస్తేనే బంకులకు డీజీల్, పెట్రోల్ సరఫరా చేస్తామన్న నిర్ణయంతో అటు ఆయిల్ సరఫరా దారులు, బంకుల యజమానుల మధ్య తలెత్తిన ఆర్దీక లావాదేవీల సమస్యలతో చాలా బంకుల్లో డీజీల్, పెట్రోల్ సరఫరా కానీ పరిస్థితి కనిపిస్తోంది. గత రెండు మూడు రోజులుగా ఉభయ గోదావరి జిల్లాల్లో చాలా బంకుల్లో డీజీల్ నిల్ అనే బోర్డులే దర్శనం ఇచ్చాయి.. ఇది ఒకింత ఆందోళన కలిగించే అంశంగా పరిణమించి ప్రజల్లో పానిక్ పరిస్థితిలోకి నెట్టింది. డీజీల్ కొరత వస్తోందన్న ఆందోళనల నేపథ్యంలో డీజీల్ విక్రయాలు జరుపుతోన్న బంకుల వద్ద డబ్బాలు పట్టుకుని బారులు తీరారు. భారీ వాహనాలు, లారీలు, టిప్పర్లు, కళాశాల బస్సులు కూడా బంకులకు వరుస కట్టాయి. మరో పక్క డీజీల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెరుగుతాయన్న ప్రచారం నేపథ్యంలో కొందరు డీలర్ల కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.ఇదిలా ఉంటే రైతులు అవసరానికి మంచి డబ్బాల్లోనూ, ట్యాంకుల్లోనూ నింపి మరీ డీజీల్ ను కొనుగోళ్లు చేస్తున్నారు. ఒక్కసారిగా పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరుతోన్న వాహనాలు, సోషల్ మీడియాలో జరుగుతోన్న ప్రచారంతో అధికారులు స్పందించారు.. డీజీల్ కొరత ప్రస్తుతం లేదని, ప్రజలు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నారు.డీజీల్ కొరత ప్రభావం వ్యవసాయ, ఆక్వా, రవాణా రంగాలపై తీవ్రంగా ప్రభావం పడుతుందంటున్నారు. ఇప్పటికే చాలా బంకుల్లో డీజీల్ లభ్యత లేకపోవడంతో డీజీల్‌తో నడిచే వాహనాలు నిలిపివేసే పరిస్థితి పలు చోట్ల కనిపిస్తోంది. ఇదిలా ఉంటే ఉభయ గోదావరి జిల్లాలో రబీ కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. 95 శాతం కోతలన్నీ వరికోత యంత్రాల ద్వారానే జరుగుతుండగా డీజీల్ కొరత ప్రభావం వ్యవసాయ రంగంపై తీవ్రంగా పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క పది రోజులపాటు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో రైతులు వరి కోతలను మరింత స్పీడ్ పెంచారు. ఉభయ గోదావరి జిల్లాకు ఆయువుపట్టు అయిన ఆక్వారంగం కూడా డీజీల్ కొరత గనుక జరిగితే తీవ్ర సంక్షోభం ఎదుర్కోవాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. వేసవి కాలం కావడంతో విద్యుత్తు కోతలు తీవ్రంగా ఉంటాయని, జనరేటర్లకు డీజీల్ వినియోగం భారీగా అవసరం ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు తప్పవన్న ఆలోచనతో చెరువుల వద్ద డీజీల్ నిల్వలు ఉండేలా చూసుకుంటున్నారు. బంకుల వద్ద లారీలు, కళాశాల బస్సులు క్యూ కడుతుంటే డీజీల్‌తో నడిచే కార్లు, ఇతర వాహనాల డిక్కీల్లో అదనంగా డబ్బాలు తెచ్చుకుని మరీ డీజీల్ పట్టించుకుంటున్నారు. కొంత మంది ఆక్వా రైతులు 200 లీటర్ల సామర్థ్యం ఉన్న డబ్బాల్లో డీజీల్ పట్టించి ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నారు.పెట్రోల్, డీజీల్ సరఫరా విషయంలో బంకుల యజమానులు ఆయిల్ డీలర్లకు ముందస్తుగానే చెల్లింపులు చేయాలన్న నిభందనల కొన్ని రోజులుగా అమలు చేస్తున్నారు. దీంతో కొన్ని బంకుల యజమానులు చెల్లింపులు ఆలస్యంగా చేయడం, కొన్ని బంకుల యజమానులు అసలు ముందస్తు డిపాజిట్‌లు చేయకపోవడం వల్ల చాలా బంకుల వద్ద డీజీల్ నిల్ బోర్డులు ఎక్కవగా కనిపిస్తున్నాయంటున్నారు. బంకుల వద్ద మాత్రం డీజీల్ నిల్ అనే బోర్డులు కనిపిస్తుండడంతో సామాన్య ప్రజలు, వాహన దారులు మాత్రం డీజీల్ కొరత వస్తుందన్న అనుమానంతో అవసరం లేకపోయినా అవసరానికి మించి కొనుగోళ్లు చేయడంతో గత మూడు రోజులుగా తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలో పలు బంకుల్లో డీజీల్ నిల్ బోర్డులు దర్శనం ఇస్తున్నాయి.ఆయిల్ బంకుల వద్ద తలెత్తుతోన్న ప్యానిక్ పరిస్థితులకు ప్రధాన కారణం కొన్ని రోజుల పాటు డీజీల్ దొరకదన్న ప్రచారమే కారణంగా కనిపిస్తోంది. దీని వల్ల డీజీల్ అవసరానికి మంచి కొనుగోళ్లకు వాహన దారులు ఎగబడుతున్నారు. పెట్రోల్ విషయంలో అయితే పెట్రోల్ తో నడిచే ద్విచక్రవాహనాలు, లైట్ మోటారు వెహికల్ తమ అవసరానికి మించి కొనుగోళ్లు చేసినా ఈ పెట్రోల్ కొరత ప్రభావం కేవలం రెండు మూడు రోజులు మాత్రమే కనిపిస్తుందని, ఎందుకంటే వారు నింపిన పెట్రోల్ వినియోగించుకున్నాకే మళ్లీ బంకుల వద్దకు వస్తారని, అయితే డీజీల్ విషయంలో మాత్రం భిన్నంగా ఉంటుందంటున్నారు. రవాణా రంగంలో భారీ వాహనాలకు ఎక్కువగా డీజీల్ అవసరం, వ్యవసాయ, ఆక్వా రంగానికి భారీగా వినియోగం ఉండడం వల్ల డీజీల్ కొరత ప్రభావం ఆయా రంగాలపై తీవ్రంగా పడుంతుంటని ఆందోళన వ్యక్తం అవుతుంది.డీజీల్ అవసరాలకు సరిపడా డీజీల్ నిల్వలున్నాయని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. డీజిల్ సరఫరాపై నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ స్థానిక కలెక్టరేట్‌లో ఆయిల్ కంపెనీల ప్రతినిధులు మరియు జిల్లా పెట్రోల్ బంక్ డీలర్ల అసోసియేషన్ తో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు సూచనలు చేశారు. ప్రస్తుతం వరి కోతల సీజన్ మరియు ఆక్వా రంగం అవసరాల దృష్ట్యా డీజిల్ కొరత అనే మాట వినపడకుండా డిమాండ్ సప్లైలు పాటిం చాలని ఆదేశించారు. ఎవరైనా డీలర్లు ఉద్దేశ పూర్వకంగా నిల్వలను దాచినా లేదా కృత్రిమ కొరతను సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దనీ హెచ్చ రించారు.చమురు నిల్వలు నిండు కుంటాయనే భయంతో బంకుల వద్ద భారీగా క్యూ కట్టవద్దని వాహనదారులు తమకు అవసరమైన మేరకే ఇంధనాన్ని కొనుగో లు చేయాలన్నారు. పుకార్లను వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబ డతాయ న్నారు

## ఫుట్‌పాత్ ఆక్రమణలపై కఠిన చర్యలు--

### మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న --



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27-: పట్టణంలో పుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాలపై మున్సిపల్ కమిషనర్ బి శేషన్న కఠిన చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం పట్టణంలో పలు కాలనీల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన ఆయన, పాదచారుల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న అక్రమ నిర్మాణాలను యంత్రాలతో కూల్చివేయించారు.పుట్‌పాత్‌లు ప్రజల నడక కోసం కేటాయించినవని, వాటిపై దుకాణాలు, షెడ్లు, మెట్లు, ఇతర నిర్మాణాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు రహదారులపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని కమిషనర్ తెలిపారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు పెరగడమే కాక ప్రమాదాల అవకాశాలు కూడా అధికమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం, భద్రత దృష్ట్యా ఆక్రమణలను పూర్తిగా తొలగించే దిశగా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.అక్రమంగా పుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, స్వచ్ఛమైన మరియు సురక్షితమైన పట్టణం నిర్మాణానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముందస్తు నోటీసులు జారీ చేసినప్పటికీ పట్టించుకోని చోట్ల ప్రత్యేకంగా కూల్చివేతలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్వైజర్ లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కళా శిక్షణ శిబిరం ప్రారంభం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27-: కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత లలిత కళలు, క్రీడల వేసవి శిక్షణ శిబిరం “కళా సాధన?2026” మే 1 నుంచి జూన్ 2 వరకు కే.ఎన్.ఎం మున్సిపల్ స్కూల్ ఆవరణలో నిర్వహించనున్నారు.ఈ శిబిరంలో శాస్త్రీయ, ఆధునిక నృత్యం, సంగీతం, గిటార్, కీబోర్డ్, చిత్రలేఖనం, మిమిక్రీ, హస్తకళలు, చదరంగం, కరాటే, టైక్వాండో, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాల్లో 25 మంది కోచ్‌లతో శిక్షణ అందిస్తారు.జూన్ 2న ముగింపు కార్యక్రమంలో శిక్షణ పొందిన విద్యార్థుల ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తారు. శిబిరంలో పాల్గొనడానికి ఎటువంటి రుసుము లేదని నిర్వాహకులు డా. మధుసూదనరావు, డా. రవికృష్ణ తెలిపారు.వివరాలకు: 8142962974, 7989627760, 6300715927.

## నంద్యాలలో ఇంధన కొరత లేదు---

### కలెక్టర్ రాజకుమారి గణియా---



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27:-నంద్యాల జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా సాధారణ స్థితిలోనే ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం ఐఓసిఎల్, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంకులను ఎస్పీ సునీల్ షొరాణ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లాలో ఎక్కడా ఇంధన కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని బంకుల్లో సరిపడా నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఉదయం కొంత డీజిల్ కొరత కనిపించిన చోట్ల సాయంత్రానికి సరఫరా సాధారణం చేస్తామని చెప్పారు.అవసరానికి మించి ఇంధనం కొనుగోలు చేయవద్దని, కాన్లలో నిల్వ చేయడంపై నిబంధనలు అమల్లో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ అవసరాల కోసం మాత్రమే సంబంధిత అధికారుల ధృవీకరణతో కూపన్ ద్వారా డీజిల్ అందజేస్తామని చెప్పారు.ఎస్పీ సునీల్ షొరాణ్ మాట్లాడుతూ, బంకులపై నిరంతర తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. లూజ్‌గా ఇంధన విక్రయం నిషేధించామని, బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

## ఇంధన కొరతపై సిపిఐ ఆందోళన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27: రాష్ట్రంలో ఇంధన కొరత తీవ్రంగా మారడానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని సిపిఐ నాయకులు విమర్శించారు. గత ఐదు రోజులుగా నంద్యాల జిల్లాలో




పెట్రోల్, డీజిల్ సరఫరా అంతరాయం కలగడంతో వాహనదారులు బంకుల వద్ద గంటల తరబడి క్యూల్లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.జిల్లా అధికారులు కొరత లేదని చెబుతున్నప్పటికీ, కొందరు పెట్రోల్ బంక్ యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యను నిరసిస్తూ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సంజీవ్ నగర్ గేటు వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహం ముందు నిరసన చేపట్టారు. కార్యక్రమానికి పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ అధ్యక్షత వహించగా, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సోమన్న పాల్గొన్నారు.ఇంధన సరఫరాను తక్షణమే పునరుద్ధరించి, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలని వారు కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు హుస్సేన్ భాషా, నాగార్జున, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల వేగవంత పరిష్కారం పై దృష్టి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 :-జిల్లాలో ప్రజా సమస్యలను నిర్దేశిత గడువులోపే వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.అర్జీలను ఆలస్యం చేయకుండా సమయపాలనతో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా రీ-ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, అర్జీదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అధికారుల లాగిన్‌లలో 153 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించి వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాల పరిధిలో రీ-ఓపెన్ అయిన అర్జీలను ప్రాధాన్యతతో త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్, పోలీస్, మున్సిపల్ తదితర శాఖలకు చెందిన కేసులు ఎక్కువగా రీ-ఓపెన్ అవుతున్నందున సమగ్ర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 159 అర్జీలు స్వీకరించగా, భూ సమస్యల పరిష్కారంలో ఇవి ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ గ్రీవెన్స్ వేదికలో 80 ఫిర్యాదులు--

### చట్టపరమైన పరిధిలో వేగవంతంగా న్యాయం చేస్తాం: ఎస్పీ సునీల్ షొరాణ్---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 :-నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ప్రజల నుంచి మొత్తం 80 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన స్వయంగా మాట్లాడి సమస్యల స్వరూపాన్ని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఫిర్యాదును చట్టపరమైన



పరిధిలో సమగ్రంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి ఆలస్యం లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా ఒకే సమస్యపై ఫిర్యాదులు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా బాధ్యతతో పనిచేయాలని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా పోలీసు అధికారులను సంప్రదించి తమ సమస్యలను తెలియజేసుకునే అవకాశం లభిస్తోందని, ఈ వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

## పెట్రోల్, డీజిల్ తీవ్ర కొరతపై తక్షణ చర్యలు తీసుకోవాలి.

### జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ కు వినతి.

### రాయలసీమ రవికుమార్‌రాష్ట్ర అధ్యక్షులు,ఆర్వీపీఎస్.

కర్నూలు:జిల్లాలో ప్రస్తుతం పెట్రోల్ మరియు డీజిల్ తీవ్ర కొరత ఏర్పడి, ప్రజల సాధారణ జీవనం పూర్తిగా దెబ్బతిన్నది. ఈ పరిస్థితి రోజురోజుకు మరింత తీవ్రంగా మారుతూ ప్రజల్లో తీవ్ర ఆందోళన, అసంతృప్తి పెంచుతోందని కావున పెట్రోల్,డీజిల్ కొరతను నివారించాలని కోరుతూ నేడు కలెక్టర్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో జరిగినపప్రజాసమస్యల పరిష్కార వేదికలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాయలసీమ రవికుమార్, జిల్లా కార్యదర్శి కె. రాము జేసీ నూరుల్ ఖమర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పెట్రోల్ బంకుల వద్ద గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అనేక ప్రాంతాలలో పూర్తిగా సరఫరా నిలిచిపోవడం వల్ల రైతుల వ్యవసాయ కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని,రవాణా వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందని,ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,అత్యవసర సేవలు కూడా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఇదిలా ఉండగా, కొంతమంది డీలర్లు పెట్రోల్, డీజిల్‌ను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తూ, అవుతుందని కావున ప్రస్తుత పరిస్థితి అత్యంత తీవ్రమైనదిగా మారిన నేపథ్యంలో జిల్లాలో పెట్రోల్ మరియు డీజిల్ సరఫరాను తక్షణమే సాధారణ స్థితికి తీసుకురావాలని,నిల్వలు దాచిపెట్టే మరియు అక్రమంగా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,ప్రతి పెట్రోల్ బంక్ వద్ద సరఫరా స్థితిపై స్పష్టమైన నిఘా ఉంచి పెట్రోల్,డీజిల్ అక్రమ మార్గంలో తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని,ఈ సమస్యపై ప్రత్యేక పర్యవేక్షణ బృందాన్ని ఏర్పాటు చేసి రోజువారీగా తనిఖీలు నిర్వహించాలని ప్రజల ఆవేదనను దృష్టిలో ఉంచుకొని వెంటనే చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించవలసిందిగాకోరుచున్నామని అన్నారు.

## 56 మంది రైతులకు డీ-నోటిఫై పత్రాలు---




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 :-జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంలో భాగంగా 56 మంది రైతులకు డీ-నోటిఫై క్లియరెన్స్ పత్రాలు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పత్రాలను అందజేశారు.నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూములు, 22-ం(1) భూములకు సంబంధించి అర్హులైన రైతులకు పరిశీలన అనంతరం డీ-నోటిఫికేషన్ మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 2017 చట్టం ప్రకారం దీర్ఘకాలంగా భూమిని అనుభవిస్తున్న వారికి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు.మొత్తం 56 మందికి సంబంధించిన భూముల్లో ఆత్మకూరు మండలంలో 63.69 ఎకరాలు, నంద్యాల, డోన్, బనగానపల్లె మండలాల్లో 85.51 ఎకరాల భూములకు క్లియరెన్స్ పత్రాలు అందజేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## స్వీయ గణన పూర్తి చేయాలి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 :-జనగణన కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారులు, సిబ్బంది తమ వ్యక్తిగత వివరాలను తక్షణమే నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ సూచనలు చేశారు. జనగణన ద్వారా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు నిర్ణయించబడతాయని పేర్కొన్నారు.జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు వదంతులను నమ్మకుండా అవసరానికి మాత్రమే వినియోగించాలన్నారు. అధికంగా నిల్వ చేసుకునే ప్రయత్నాల వల్ల తాత్కాలిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు.పెట్రోల్ బంకులపై కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లకు ఆదేశించారు. స్టాక్ ఉండి కూడా ‘నో స్టాక్’ బోర్డులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే బంకులను సీజ్ చేస్తామని తెలిపారు.వ్యవసాయ వాహనాలు, అత్యవసర సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని, సాయంత్రం నాటికి జిల్లాలో ఇంధన సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి వస్తుందని కలెక్టర్ వెల్లడించారు.

## గోమాతకు జాతీయ జంతువు హోదా కోరుతూ వినతి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 27 :- గోమాతను జాతీయ జంతువుగా గుర్తించాలని కోరుతూ వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు సోమవారం సిరివెళ్ల ఎమ్మార్వో కార్యాలయంలో ఆర్ఐ రాఘవేంద్రకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గో సేవ, గో సంరక్షణను ప్రోత్సహించే దిశగా “గో సంకల్పం” కార్యక్రమంలో భాగంగా ఈ వినతిని అందజేసినట్లు తెలిపారు. గోమాత రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో దానధర్మా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వర్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు నాగిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మండల కార్యదర్శి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190